# పెళ్ళెందుకు?

# దద్దనాల రంగనాయకమ్మ

ప్రియమైన కుసుమకి, 4-4-'56;

నేను శ్రీమతిని కాబోతున్నానని తెలియజేయటానికెంతైనా సంతోషిస్తున్నాను. శుభలేఖకూడా పంపుతున్నాను. నీ కాశ్చర్యంగా ఉందిగదూ? అవును. నిన్ను ఒక్కసారిగా ఆశ్చర్యపర్చెయాలనే యిన్నాళ్ళూ తెలీనివ్వలేదు. వరుడి వివరాలన్నీ శుభలేఖలో ఉన్నాయి. అతన్ని స్వయంగా చూశాను. ఫొటోకూడా ఇచ్చారు వాళ్లు. అది నీకు పంపుతున్నాను. ఎలా నచ్చింది వ్రాస్తావుగా? పెళ్ళికి రావటానికి రెడీగావుండు. ఇంకా కొంచెం టైముందిగా. మీ వూరు వచ్చినప్పుడు మీ అమ్మకీ వాళ్ళకీ చెప్తాను. సిద్ధంగావుండూ? వస్తా. నీపెళ్లెప్పుడో మరి!

నీ

పద్మ.

* * *

నాల్లో పద్మా... 7-4-56;

నీ లేఖ చూచి స్తంభించిపోయాననుకో. నీవు శ్రీమతివి కాబోతున్నందు కెంతైనా చింతిస్తున్నాను. నీ కీ బుద్ధెందుకు పుట్టిందోనని చాలా ఆశ్చర్యంగావుంది. అసలు పెళ్ళెందుకు? పోనీ చేసుకుంటేమట్టుకూ, యింత తొందరెందుకు? హాయిగా, స్వేచ్ఛగా బ్రతికే బ్రతుకుని పంజరంలో పెడ్తున్నావా పద్మా? పెళ్ళంటే నీకేదో సరదాగా ఉందిగాని, ఎంత కష్టంగా ఉంటుందో! తెలీని వాతావరణంలో, తెలీని మనిషితో, జీవితాంతం గడపటం ఎంత కష్టం! ఇద్దరి ఆశయాలూ ఒకటిగాకపోవచ్చు. ఏమో బాబూ, నువ్వా వూబిలో కెందుకు దిగాలనుకొంటున్నావో? స్వేచ్ఛనేది వుండదుగదా. అంతా ఐపోయాక, ఇక నీకెన్ని చెప్తేమాత్రం ప్రయోజనమేమిటి? తర్వాత నీకే తెలుస్తుందిలే-పెళ్ళైతే ఎక్కడికో వెళ్ళిపోతావ్. ఎప్పటిలాగే మా వూరు రావటానికి వీలుపడుతుందా? మీవారి దయ. ఇక మనస్నేహం వృద్ధిపొందదేమోనని భయంగావుంది. నన్ను కొస్త జ్ఞాపకం ఉంచుకోసుమీ -వరుడి రూపురేఖలు, పరిస్థితులు నాకు నచ్చాయి. గుడ్డిలో మెల్లలా, పెళ్ళిచేసుకుంటున్నా, మంచివాణ్నే ఏరుకుంటున్నందుకుమాత్రం సంతోషంగా వుంది. ఇక నీపెళ్ళికి నేను రావటం, రాకపోవటం అన్న ప్రశ్నే లేదు. నాలుగురోజులుండనగానే వస్తా. ఈమధ్య ఓసారి రా- నా లేఖనిబట్టి నా పెళ్ళెప్పుడో నిర్ణయించుకో గలవ్ గా? ఉంటా-టా-టా

నీ

కుసుమ.

* * *

కుసుమా! 10-4-56;

నీ లేఖ పూర్తిగా అర్థంచేసుకొన్నాను. నాకు నవ్వొచ్చింది. నీ పిరికిరూపాన్ని వూహించగలిగాను. నేను నీకులా, పెళ్ళిని గూర్చి తలపోసేవాళ్లనేకమంది వున్నారు. పెళ్ళి చేసుకోవటమంటే వూబిలోకి దిగటమనీ, స్వేచ్ఛని పోగొట్టుకొని ఇతరుల దయమీద బ్రతకటమనీ నీలాంటివాళ్లు వూహిస్తున్నారు. కాని, అది నిజంకాదు. పెళ్ళి కేవలం శారీరకానందంకోసం కాదు - జీవితాంతం వరకూ దంపతులు ఒకరికొకరు అండ. చూడూ... నీ విషయాలు నాకూ— నా విషయాలు నీకు చెప్పకుంటున్నాం. అలాగాకుండా, మనసులోవి ఎవరికీ చెప్పకుండా వుండగలమా? జీవిత భాగస్వామిస్థానం యింకా ఎక్కువ. ఎక్కడా మార్పులేని, ఒంటరిజీవితం గడపటంలో, ఏదో తెలీని, బాధ, ఆవేదన, వుంటాయి. ఎంతో లోటున్నట్లుగా ఫీలవుతాం. ఓ ఫ్రెండు కావాలనిపిస్తుంది. (నీలాంటి ఫ్రెండు కాదు)-సంబంధం కలిశాక పరాయివాళ్లలా అవుతారు? ఇద్దరి ఆశయాలూ కలవకపోతే పోనీ, ఎవరిష్టం వారిదే. ఒకర్నొకరు, గౌరవించి, ప్రేమించుకొంటే చాలు-పెళ్లికి ముఖ్యకారణం, యింకోటేమిటంటే, మనని జీవితాంతం ఎవరు పోషిస్తారు? మనకంటే పెద్దవాళ్ళైన తల్లిదండ్రులు మన జీవితాంతంవరకూ బ్రతకరుగదా? అన్నలూ, తమ్ముళ్లూ చూస్తారనుకోవటం చాలా పొరపాటు. మనమీద యివ్వాళున్న ప్రేమ, రేపు లేకపోవచ్చు. మనం కేవలం జీవచ్ఛవాల్లా బ్రతకం. ఎన్నో అవసరాలుంటాయి. రాను, రాను వాళ్లికి భారమౌతాము. కుసుమా! ఇక, యింకో కారణం. కాలూ, చెయ్యా వున్నప్పుడెలాగో కాలం వెళ్లబుచ్చగలిగినా, ముసలితనంలో సేవచెయ్యటానికి తప్పకుండా పిల్లలుండాలి. ఈవిధంగా ఆలోచిస్తే పెళ్లికి గల ప్రాముఖ్యం తెలుస్తుంది. పెళ్లితోబాటు స్వేచ్ఛనశిస్తుందనుకోకు. స్త్రీకితనగృహంలో వుండే స్వేచ్ఛకంటే, యితరత్రా ఎక్కువ స్వేచ్ఛ వుంటుందనుకోకు. దంపతులు కేవలం సహచరులు. ఎవ్వరూ యజమానులూగారు—దాసీలూగారు—తెలిసిందా? పిచ్చివేషాలు మాని, నీవుకూడా గృహిణివవ్వు-వివాహానంతరం మన స్నేహంపోతుందనుకోవటంకూడా చాలా పొరపాటే-వరుడి రూపురేఖలికి పంగనామాలు పెట్టకుండా వదిలినందుకు థేంక్స్. జవాబు వ్రాస్తావుగా—

పద్మ.

* * *

డియర్ పద్మా... 15-4-57;

నీ లేఖతో చాలావరకూ ఏకీభవిస్తున్నాను. కాని నా విషయంలోమట్టుకు, నువ్వూహించినంత ఘోరంలేదు. బ్రతుకు తెరువు లేనివాళ్లూ, మొగవాడి స్నేహంకోసం అలమటించిపోయే వాళ్లూ పెళ్ళిచేసుకోవాలేమోలే. కానీ, నాకాగొడవ, బాదరబందీ లేదు. మా అమ్మా నాన్నా నాకు ఆస్తి ఇస్తారు. అన్నిటికంటే ముఖ్యం మా అన్నయ్య ప్రేమ. నేనంటే ఎంతిష్టమో వాడికి! నువ్వూ చూశావుగా? నన్ను చులకనగా, భారంగా చూస్తాడంటే ఎలా నమ్మను? ఈమధ్య రేడియోగ్రాం కొన్నాం. హాయిగా, కాలుమీద కాలేసుకొని, పాటలు వింటూ, పుస్తకాలు చదువుకొంటూ, సినిమాలు చూస్తోంటే ఎందుకు జరగదు కాలం? నిర్విచారంగా సాగిపోతుంది మెయిల్లా. వ్రాయటం మరిచా. మా వదిన అబ్బాయి నెత్తుకొని వచ్చింది. వారంరోజులవుతుందిలే. చాల మంచిది పద్మా. నన్ను చాలాగౌరవంగా చూస్తుంది. నాకు సరదాగా గడిచిపోతోంది-పెళ్ళైనా నన్ను మర్చిపోనని వ్రాసినందుకు సంతోషం. త్వరలో నువ్వు కూడా నీ స్వర్గసీమలో పడిపోతావుగా. మరి సంసారమంటే స్వర్గమనేగా నీ వుద్దేశ్యం. మా యింటిపక్క-

# ★ పెళ్లెందుకు? ★

సగోజిని సంసారం చూస్తోంటే జన్మజన్మాలకి పెళ్లొద్దురా అనిపిస్తోంది. సరేలే. నా పెళ్ళివిషయం మర్చిపో. ఇక నా ఉగు రోజుల్లో వచ్చేస్తున్నానుగా. ఇల్లంతా పెళ్ళిపనుల్లో హడావిడిగా వుంటోంది గదూ? వస్తా.

శుక్రవారం సాయంత్రం కోచీకి స్టేషన్‌కి తా.

కుసుం.

* * *

డియర్ కుసుమా... 25-4-56;

నా పెళ్ళికొచ్చి వెళ్ళాక ఉత్తరం వ్రాయలేదు. ఏమైనా సుస్తీగా వుంటోందా? నాజాబందగానే జవాబు వ్రాయి. నా సంగతి కొంచెం వ్రాస్తున్నాను. ఈమధ్య నా కార్యక్రమం మారింది. ఏమిటో, యిదివరకు ఎక్కడబడితే అక్కడ ముందకొడిగా కూర్చుంటే సాగిపోయేది. కాని, ఈమధ్య ఏదో బాధ్యత మీదబడినట్లుగా వుంటోంది. ఆయనకి కొస్త కోపంజాస్తి. కాని, మళ్ళా తక్షణమే కరిగిపోతారు. నాకే ఆశ్చర్యం వేస్తుంటుంది. నీకు చెప్తే, "పెళ్ళి చేసుకొన్నావ్. బాధపడుతున్నావ్," అని వెక్కిరిస్తావేమోగానీ, యిది ఏమంత కష్టంగాదులే. కొత్త వాతావరణం కదూ, కొస్త బెట్టుగా వుంటుంది. అంతే. మొన్న నేంజరిగిందంటే, గాతమ్మకు ఆయన షర్టుమీద సిరాజల్లాను. అది చూచి ఆయన నన్ను కొప్పడ్డారు. నా తప్పేముంది? కొత్తల్లుడని ఏమేమో చేస్తుంటారు. తర్వాత "నాకు కోపం యెక్కువ పద్మా. నువ్వేం అనుకోకు" అని బ్రతిమిలాడుతారు. పాపం నాకే జాలేస్తుంది. భర్త సద్గుణాన్ని భార్య అనుభవించేటప్పుడు దుర్గుణాన్ని మాత్రం ఎందుకనుభవించకూడదు, అని అనుకొంటాను. ఏమంటావే? ఏది ఏమైనా సంసారం సుఖంగా సాగిపోవాలంటే ఒకరినొకరు బాగా అర్థం చేసుకోవాలి. "పెళ్లయ్యాక ఆడవాళ్లంతా మొగుడిగొడవలే చెప్తారు" అంటారు చాలామంది. కానీ, నువ్వు శ్రద్ధగా వినేదానివున్నావనే చెప్తున్నా. నీ విశేషాలతో త్వరగా జాబు వ్రాయి. అందర్నీ అడిగానని చెప్పు. మరిచా. నేను నెలాఖరులోగా అత్తవారింటికెళ్ళిపోతున్నాను. అందర్నీ విడిచి వెళ్ళటం బాధగానే వుంది.

నీ

పద్మ.

* * *

ప్రియమైన పద్మా... 30-4-56;

నీమధ్య ఉత్తరాలు వ్రాయకపోవటాని కారణం మరేంలేదు. కొస్త బద్ధకంచానంతే. రానురాను సంసారసాగరములో పడిపోతున్నావన్నమాట. మీవారికింత కోపమా? ఐతే అప్పుడప్పుడూ మీవారి వేళ్ళరుచికూడా చూస్తున్నావన్నమాట. భేష్. పాపం నీ దవడమీద శ్రీవారి అయిదువేళ్ళూ అంటుకొంటే చూట్టానికెంతో గుంటుందో సుమీ! అదే నీకు స్వర్గంకదూ! నావిషయా లేమున్నాయిలే. తిని తిరగటమేగా. ఆఁ ఈమధ్య నాన్నకి యెంతో జబ్బుచేసింది. ఓరాత్రి బాగా భయపడిపోయాం. ప్రస్తుతం కొస్తబాగానే వున్నారనుకో. నో మోర్ న్యూస్.

కుసుమ.

* * *

పద్మా... 1-5-56;

క్రిందటి వుత్తరం యింకా నీకు అంది వుంటుందో! లేదో! అప్పుడే, యీ ఘోరం జరిగిపోయింది. క్షణంలో ఏంజరిగేది తెలీదు. అకస్మాత్తుగా నాన్నకి జబ్బెక్కువయిపోయింది. నేను దగ్గరగా కూర్చునే వున్నాను పద్మా. నాన్న చచ్చిపోయారు. అబ్బా ఎంతఘోరం! నా కా దృశ్యం కళ్లకు కట్టినట్లుంది. నాన్నకోసం ఎంతగా ఏడిచానో! కాని నాన్న చేసినపనికి నాకు కొంచెం కోపంగావుంది. ఆస్తంతా అన్నయ్యకీ, నాకూ చెరిసగంగా ఇస్తానని చెప్పేరుగదా ఇదివరకు? కాని, నాకు రెండు మేడలు వ్రాశారంతే. మిల్లూ, పొలాలూ అన్నీ అన్నయ్యకే వ్రాసేశారు. ఈ సంగతి నాన్న మంచంమీద వుండగానే ప్లీడర్ గారు చదివివినిపించారుమాకు. అన్నయ్య వాటాలోనే అమ్మకికూడా ఏదో వ్రాశారు. నాన్నని అడుగుదామనుకొన్నాను కాని, చావుబ్రతుకులమీద వున్న నాన్నని ఆస్తికోసం ఒక్కళ్లా వత్తిడి చెయ్యటం, చబ్బలాడుకోవటం ఏమి బావుంటుంది పద్మా? అయినా, అన్నయ్య వన్నాయం చెయ్యడులే. నేనడక్కపోయినా నాన్నే చెప్పారు, "అమ్మా. నువ్వు ఒంటరిగా వుంటానంటున్నావు. నీకు రెండు మేడలు చాలు. అన్నయ్యకప్పుడే పిల్లలు బయలుదేరుతున్నారు. మిగిలిన ఆస్తి వాడికుండాలి" అన్నారు. నేను తలూపాను. కాని, పద్మా! ఓవిషయం. నేను పెళ్లి చేసుకుంటే చేసుకొన్న తక్షణమే చెరిసగం యివ్వాలని వ్రాశారు. పెళ్లికీ, నా ఆస్తికీ, లంకేమిటి చెప్పు? నేను నా యిష్టం వచ్చినట్టు చేసుకొంటాను. సగం నాకివ్వటం న్యాయంగాదా? ఈ మధ్య ఒంట్లో సుస్తీగా వుంటోంది. ఓసారి రాగలవా? బహుశా నీకు సాగదేమో మరి. పోనీలే. అత్తవారింటికెళ్లే ముందు, తెలియజెయ్యి. అక్కడే డ్రసిస్తావు గదూ?

కుసుమ.

* * *

ప్రియమైన కుసుమకి... 3-5-56;

నీ రెండు లేఖలూ చదివాను. నాకు చాల దుఃఖమొచ్చింది మీ నాన్న పోయినందుకు! ఏం చేస్తాం? లోకసహజమే గదా? నెమ్మదిగా విచారం మర్చిపో. నాన్న నీకు ఆస్తి పంచివ్వటంలో సబబుగానే ప్రవర్తించారు. ఒంటరిగానికి ముఫై వేల విలువచేసే మేడలు చాలు. మీ అన్నయ్య తనవాటాలోదికూడా నీకిస్తాడనుకొంటున్నావా? పిచ్చిదానా! ఎంతిచ్చినా ఆఖరికి అన్నయ్యకే చెందాలిగా — నేను రాలేకపోతున్నాను. వచ్చే సోమవారము అత్తవారింటికెళ్తున్నా. ఇక అక్కడికే వ్రాయి. ఎడ్రసిస్తున్నా.

పద్మావతి.

* * *

పద్మా... 9-11-56;

అత్తవారింట్లో బాగానే వుంటోందా? ఓసారి చూట్టానికొస్తాలే. నా మేడలమీద నెలనెలా రెండువందల అరవై రూపాయలొస్తున్నాయి. అన్నయ్య వన్నే తీసుకోమన్నాడు. కాని, నేనేంచేసుకోను? ఎలా ఖర్చుపెట్టను? అందుకనే అన్నయ్యనే వాడుకోమన్నాను. నీ కార్యక్రమం మారినట్టే, నా దినచర్యకూడా మారింది. అన్నయ్యగారి పిల్లలపోషణ నాదే. వాళ్లకు నీళ్లు పొయ్యటమనీ, బట్టలెయ్యటమనీ, బడికి పంపించటమనీ, ఒకటేమిటి అంతా నేనే చూస్తున్నాను. అసలు మొదట్లో ఊసుపోవటానికి యీ కార్యక్రమం నేను చెయ్యటం మొదలెట్టాను. ఎప్పుడైనా బద్ధకించిగానీ, ఇంకో కారణంచేతగాని, వాళ్లగొడవ నేనుచూడకపోతే, యిక మావదిన వాళ్లని చూడదు సరిగదా, పైగా ఏదో చాకిరీ చేసేస్తున్నట్లుగొణుక్కుంటుంది. ఏమైనా అంటే మాఅన్నయ్య ఏమనుకొంటాడో అని భయపడతాను. నిజముగా మా వదిన చిత్రంగా మారిపోయింది. ఇదివరకున్న ప్రేమలేదు. అంతగా మాట్లాడదుకూడా. నీకు ఈ త్తరంలో ఎంతని వ్రాయను? నాకెంతో బాధగా వున్నట్టుంది. కొన్నాళ్లు నీదగ్గర కొచ్చేద్దామా అనిపిస్తోంది. మొన్న అన్నయ్య పాలుగుచీరలు తెస్తే, వదిన మూడు తీసుకొంది. ఒక్కటి నాకిస్తూ "నీకొకటి చాలుగా?" అంది. అదికూడా నాకొద్దన్నాను. నేను కొనుక్కోవాలంటే కొనుక్కోగలననుకో. కాని యెక్కడికక్కడ సరిపెట్టుకోమంటారు. మా అమ్మకూడా కాంతిలేనట్లుగానే కన్పడుతోంది. ఇంతవరకు లేని ఆవేదనేదో నాలో ఏర్పడుతోందని నా వుద్దేశం. డాక్టర్నడిగితే మానసికంగా బాధ వుండవచ్చుననీ,

కొన్నాళ్లు ఎక్కడికైనా వెళ్ళిరమ్మంటు న్నారు. ఇలావుంది పరిస్థితి. పదవతారీఖున నా ఇరవైయ్యవ పుట్టినరోజు. కాని జరుపు కోను.

నీ
స్నేహితురాలు "కుసుమ"

*     *     *

కుసుమా...     15-11-'56;

నీ లేఖచదివి నీపరిస్థితి నర్థంచేసుకొన్నాను. నీలో తీరని అశాంతి రగుల్కొంటోంది. దానికి కారణం నీవంటరితనం. నేను చెప్పిన దానికన్నా, అనుభవ పూర్వకంగా తెలుసు కొంటున్నావు. నీ అందచందాలను చూచి ఆనందించే వ్యక్తి లేనప్పుడు, యిక అంద చందాలకు ప్రాముఖ్యం యివ్వటం అనవసర మని మీావదిన అభిప్రాయమై యుండొచ్చు. ఇప్పటికే నీ మనస్సిలా బాధపడిపోతోంటే యిక జీవితమంతా ఎలా గడుపుతావు? ఇది నీ వ్యక్తిగత సమస్య. నీకు వెన్నెల్లో నిం చుంటే ఏభావాలూ స్ఫురించవా? ఏదో లోటున్నట్లుగా లేదా? ఎక్కడో, ఎవరో కష్టపడ్డారని, భీష్మప్రతిజ్ఞ పట్టటంబావుండదు కుమీా! బాగా ఆలోచించు.

పద్మ.

*     *     *

పద్మకి...     2-12-56;

పద్మా! నాకీ అభిప్రాయం ఏర్పడిన వెంటనే నీకీ వుత్తరం వ్రాస్తున్నాను. నేను తప్పకుండా పెళ్ళిచేసుకొంటాను. నాకిప్పు డెంతానందంగా వుందో! నేను తన చెప్పు చేతల్లో వుండాలని మావదిన వుద్దేశ్యం. మొన్నటిసారి నాకు వారంరోజులపాటు జ్వరం వచ్చింది. అసలు నాకు మందులూ అవీ అమ్మే ఇచ్చేదనుకో. అమ్మ ఏదైనా పనిమీాదవుంటే మందుకలిపి యివ్వటానికి వదిన విసుక్కునేది "నేనీచాకిరీ చెయ్యలేను. జీవితాంతం యీావిడికి చెయ్యమని నానొసట రాసిపడేశాడు దేవుడు" అని గొణుక్కునేది. అంత జ్వరంలోకూడా ఆవిడమాటలకి ఎంతగా ఏడుపొచ్చిందో! ఇప్పుడే యింత విసుక్కునేది, నేను ముసిలిదానినైతే, తన పిల్లల్ని చూడనిస్తుందా? పెళ్లెందుకు? అని వాదించినందుకు చాలా సిగ్గుపడుతున్నాను. ఒంటరి జీవితానికి ఆనందంలేదు. నీకు చెప్ప కుండా వరుణ్ణికూడా నిర్ణయించుకున్నందుకు క్షమించాలి. ఇంకా అతన్ని అడగలేదనుకో. అన్నయ్యద్వారా అడిగిస్తాను. అతనెవరో తెలుసా? మన స్కూలు ఫైనల్ క్లాస్‌మేట్ "రాధానాథ్." ఇక్కడ ఒక ఆఫీసులో క్లర్కుగా వున్నాడు. అతనికేమీా ఆస్తిలేదు. ఉన్నవాళ్లం ఉన్నవాళ్లకే ఇస్తేటకంటే, ఒక లేనివాణ్ణి ధనవంతుణ్ణిచెయ్యటం మంచిది కాదంటావా? నీ అభిప్రాయము వ్రాయి. నువ్వు చాలా సంతోషిస్తావు గదూ.

కుసుం.

*     *     *

15-12-'56;

చిరంజీవి కుసుమని సుమంగళిగా దీవిస్తూ వ్రాసేది...

నీ పెళ్లికోసం ఎదురుచూస్తున్న నాకు చల్లనివార్త చెప్పావు. వేరే నా అభి ప్రాయం ఏముంటుంది? త్వరలో శుభలేఖ పంపు. ధిక్కరించనంటే ఒకమాట చెప్తా. నేను తల్లిని కాబోతున్నాను. నాతో వియ్యం పొందుతావా? నీపెళ్లికి పదిరోజులు ముందుగా వస్తా. వుంటాను మరి.

పద్మావతి.

★

